అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్ర భవనాలు

- త్వరగా పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు

పెగడపల్లిలో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఆరోగ్య ఉప కేంద్ర భవనం

పెగడపల్లి, జనవరి 15: పెగడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆరవల్లి, ఐతుపల్లి, నంచర్ల, లింగాపూర్, ఎల్లాపూర్ గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో సంబంధిత కాంట్రాక్టర్లు గతేడాది పనులు ప్రారంభించగా, పెగడపల్లి, ఐతుపల్లి, ఆరవల్లి గ్రామాల్లో స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో మూడు నెలలుగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎల్లాపూర్‌లో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా, సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. నంచర్ల, లింగాపూర్ గ్రామాల్లో భూ సమస్యతో ఇప్పటి వరకు భవన నిర్మాణ పనుల ఊసే లేదు. ఆరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత మండల పీఆర్ ఏఈ శంషేర్‌అలీని వివరణ కోరగా, సంబంధిత కాంట్రాక్టర్లు ఇబ్బందుల్లో ఉండి పనులు చేపట్టడం లేదని, నంచర్ల, లింగాపూర్‌లో భూ సమస్య, ఎల్లాపూర్‌లో టెండర్ పొందిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదని వివరించారు.

మేడిపల్లి: వెంకట్రావుపేటలో ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందజేస్తున్న వేదశ్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు చెట్‌పల్లి రాజేశ్, తదితరులు

బహుమతుల ప్రదానం

మేడిపల్లి, జనవరి 15: సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం భీమారంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ వార్డు సభ్యుడు చెక్కపెల్లి సంజీవ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మెన ప్రశాంత్, దయాకర్, బద్ధం వినయ్, హైమద్‌పాషా, ప్రభాకర్, రాజమహ్మద్, రాజేందర్, సాయి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

జగిత్యాల రూరల్/సారంగాపూర్/ కథలాపూర్/మెట్‌పల్లి రూరల్/కోరుట్ల/ మేడిపల్లి/ కోరుట్ల రూరల్, జనవరి 15: జిల్లా ప్రజలు మంగళవారం సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఇండ్ల ముందు వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి నవధాన్యాలు పోశారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పిండి వంటలు చేసుకొని కుటుంబ సభ్యులంతా కలిసి ఆరగించారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అలాగే, కనుమ సందర్భంగా రైతులు పశువులను అలంకరించి, పూజలు చేశారు. వేడుకలను జరుపుకున్నారు. గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాగా, జిల్లా ప్రజలకు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, జనవరి 15: ఇటిక్యాలలోని సాయిబాబా ఆలయ ఆవరణలో మంగళవారం ముగ్గులు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల నిర్వాహకులు చందనగిరి మనోహర్, కాటిపెల్లి గంగారెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య-వేణు, మాజీ ఎంపీటీసీ కొమ్ముల రాధ-ఆదిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు నారాయణ గౌడ్, కొల్లూరు వేణు, నీరటి శ్రీనివాస్, అనుపురం చిన్న లింబాద్రి, కసపర్తి శ్రీనివాస్, సామల్ల నవీన్, మెడపట్ల మహేశ్, నరేశ్, గంగాధర్, మంత్రి అరవింద్ గౌడ్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు నల్ల గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి, జనవరి 15: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం వేదశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ఉరుమడ్ల సంధ్య, ద్వితీయ బహుమతి కొత్తకొండ రాధ, తృతీయ బహుమతి కొత్తపెల్లి చైత్రకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుధవేని భూమేశ్‌గౌడ్, కాటిపెల్లి జగన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధవేని లక్ష్మి, వేదశ్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు చెట్‌పల్లి రాజేశ్, మానస, నాయకులు మక్బూల్, శరత్‌బాబు, రామరాజు, జలంధర్‌రెడ్డి, గంగారెడ్డి, శేఖర్, గులాం, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

కథలాపూర్, జనవరి 15: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో అంగిరి రేణుక ఇంట్లో నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు మంగళవారం తెలిపారు. ఇంట్లోని స్టీల్ డబ్బాలో 10 తులాల బంగారు ఆభరణాలు భద్రపరిచి, ఈనెల 13న చూడగా కనిపించలేదన్నారు. ఇంట్లో వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 14న ఎస్ఐ నవీన్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర సహాధ్యక్షుడిగా స్వామి

వేల్పుల స్వామి

రాయికల్, జనవరి 15: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ (ఆర్‌యూపీపీటీ) రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వేల్పుల స్వామి ఎన్నికయ్యాడు. ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో స్వామిని రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి కాంతికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏసీబీ దూకుడు

- అవినీతి అధికారుల్లో వణుకు!
- నెల వ్యవధిలో చిక్కిన డీఎఫ్ఆర్వో, సబ్ రిజిస్ట్రార్

మెట్‌పల్లి, జనవరి 15: అసలు కంటే కొసరు ముక్కువ అనే చందంగా వచ్చే జీతం సరిపోదన్నట్లుగా అదనపు ఆదాయం కోసం అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏ పని కావాలన్న లంచం డిమాండ్. అవి ముట్టజెప్పనిదే పనులు చేయని అవినీతి అధికారుల తీరుతో విసిగిపోతున్న బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. అందుకు మెట్‌పల్లి పట్టణంలో నెల వ్యవధిలో లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఏసీబీ వరుస దాడులు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారుల్లో వణుకు పుట్టిస్తున్నది. కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారు నుంచి మామిడి చెట్ల కట్టెలను కామారెడ్డికి తరలించేందుకు ఎన్‌ఓసీ కోసం మెట్‌పల్లి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంకు చెందిన పల్లపు నరేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, తనకు రూ. 10 వేలు ఇస్తేనే ఎన్‌ఓసీ ఇస్తానని తెగేసి చెప్పడంతో నరేశ్ ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు దారుడితో కలిసి ఏసీబీ అధికారులు డీఎఫ్ఆర్వోపై నిఘా పెట్టారు. ఈక్రమంలో గత నెల 16న మెట్‌పల్లి పట్టణంలోని ఓ అద్దె ఇంట్లో రూ. 4,500 లంచం తీసుకుంటుండగా డీఎఫ్ఆర్వోను ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఇది మరిచిపోకముందే తాజాగా బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. సేల్‌డీడ్, మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం ఫిర్యాదుదారుకు చెందిన రూ. 5 వేలు దస్తావేజులేఖరి సహాయకుడు ఆర్మూర్ రవి ద్వారా తీసుకుంటుండగా సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫోద్దీన్ సహా అటెండర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏడాది క్రితం మెట్‌పల్లి తహసీల్ కార్యాలయంలో ఆర్ఐతో పాటు సహాయకుడు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు బదలాయింపు (నాలా కన్వర్షన్) కోసం మేడిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఏదీ ఏమైనా వివిధ శాఖల్లో పెట్రేగిపోతున్న అవినీతి అధికారుల ఆటకట్టించేందుకు ఏసీబీ మరింత దృష్టి పెట్టాలని, ప్రజల్లోనూ అవగాహన పెంచేందుకు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తండ్రి సౌదీలో.. కొడుకు దవాఖానలో

- స్వగ్రామానికి రప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

దవాఖానలో చికిత్స పొందుతున్న సునీల్

జగిత్యాల, జనవరి 15: జిల్లా కేంద్రంలోని 29వ వార్డుకు చెందిన కుక్కల చిన్న భీమయ్య ఉపాధి కోసం సౌదీ అరేబియాలోని దమ్మామ్‌కు వెళ్లారు. వీసా గడువు ముగియడంతో అక్రమ నివాసిగా చిక్కుపోయాడు. అతని కుమారుడు సునీల్ బోన్‌మారో (ఎముక మూలుగు) వ్యాధితో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.. బోన్‌మారో మార్పిడి చికిత్సకు దాతగా భీమయ్యను సౌదీ నుంచి రప్పించాలని అతని భార్య గంగలక్ష్మి కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి సహకారంతో సీఎం రేవంత్ రెడ్డికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. సౌదీలో ఉన్న సామాజిక సేవకుడు గాజుల నరేశ్ స్థానిక అధికారులతో పాటు రియాద్‌లో ఉన్న ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేస్తున్నారు. కాగా, భీమయ్యను వెంటనే సౌదీని నుంచి రప్పించాలని స్థానికులు, కుటుంబసభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

జగిత్యాల రూరల్, జనవరి 15: అంబారిపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీ నిధులు రూ. 10 లక్షలు, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు మంజూరు చేసిన రూ. 86 లక్షలతో చేపడుతున్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప్పరిపేటలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గుట్ట సతీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక, రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన-సాగర్‌రావు, మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు గంగారెడ్డి, వెంకటేశ్వర్ రావు, సాయి, శ్రీనివాస్, ఆలయ చైర్మన్ మల్లేశం, వైస్ చైర్మన్ రంజిత్, మాజీ ఉప సర్పంచ్ నారాయణ, వెంకన్న, రమేశ్, వెంకట్ రెడ్డి, మారుతి తదితరులున్నారు.



ఆలయ ఆవరణలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, తదితరులు

జగిత్యాల, జనవరి 15: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం గురుకులాల బలోపేతానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి ఒకటో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన సర్టిఫికెట్ల సత్వర జారీ కోసం కలెక్టర్ కార్యాలయంలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారని, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, నాయకులు మనోహర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, దుమాల రాజ్‌కుమార్, సొల్లుసురేందర్, శేఖర్ గౌడ్, రమణా రావు, గుమ్ముల అంజయ్య, కుడుకల లక్ష్మణ్, జుంబర్తి శంకర్, పుల్ల మల్లయ్య, కొలగాని సత్యం, రవి, వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్ఐ నరేశ్‌కుమార్

మల్యాల, జనవరి 15: మండల కేంద్రంలో ఈనెల 4న అర్ధరాత్రి చోరీ చేసిన నిందితులను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మల్యాల మంజుల కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లి ఈనెల 4న తిరిగి వచ్చింది. ఇంటి తాళం పగులగొట్టి, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించడంతో పాటూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించామన్నారు. సిబ్బందితో కలిసి నిఘా వేసి చోరీకి పాల్పడిన మల్యాలకు చెందిన మ్యాక మహేశ్, కుంద బాబును అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి 3.5 తులాల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించాలి

కథలాపూర్, జనవరి 15: సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత సామాజిక సమరసత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ కోరారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో బుధవారం సంక్రాంతి ఉత్సవం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధులు సుదర్శన్, తెడ్డు మహేశ్, దాసరి జలేందర్, వన్నెల రాజాగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, సాయితేజ, కొండగట్టు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, జనవరి 15: మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన అడువాల రాజన్న ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ పరామర్శించారు. ఆయన వెంట మున్నూరుకాపు సంఘం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శంకర్, రాము, తదితరులున్నారు.

గోదావరిలోకి ఎస్సారెస్పీ నీరు

ధర్మపురి రూరల్, జనవరి 15: గోదావరి నదిలోకి ఎస్సారెస్పీ నుంచి ఒక టీఎంసీ నీటిని వరద కాలువ ద్వారా అధికారులు బుధవారం విడుదల చేశారు. కాగా, నీళ్లు ధర్మపురి మండలం ఆరెపల్లి, దొంతాపూర్, రాజారం వరకు చేరుకోగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సారంగాపూర్, జనవరి 15: గోదావరి నదిలోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయడంతో జలకళను సంతరించుకున్నది. దీంతో బీర్‌పూర్ మండలంలోని గోదావరి తీర ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల మెరుపు సమ్మె



డిపో ఆవరణలో ఉన్న అద్దె బస్సులు

కోరుట్ల, జనవరి 15: కోరుట్లలో సంక్రాంతి పండుగ వేళ మంగళవారం ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు మెరుపు సమ్మెకు దిగారు. తమకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ డిపో ఆవరణలోనే బస్సులను నిలిపి, నిరసన తెలిపారు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన డిపో అధికారులు ఆర్టీసీ సేవలకు ఆటంకం కలుగకుండా ఇతర డిపోల నుంచి వేములవాడ, రాయికల్, హైదరాబాద్, తదితర రూట్లకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నారు. కాగా, సమ్మెలో పాల్గొనకుండా కోరుట్ల నుంచి హైదరాబాద్‌కు బస్సు నడిపిన ఓ డ్రైవర్‌పై సమ్మెలో ఉన్న డ్రైవర్లు గొడవకు దిగి దాడి చేశారు. దీంతో అద్దె బస్సు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం అద్దె బస్సుల యజమానులతో డ్రైవర్లు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థికసాయం

కమాన్‌చౌరస్తా, జనవరి 15: జిల్లాలోని కేజీబీవీల్లో చదువుతూ టెడ్ ఎడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం దాతల సహకారంతో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, చొప్పదండి కేజీబీవీకి చెందిన శ్రీహిత, గంగాధర కేజీబీవీకి చెందిన సింధూజకు రూ. 25వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో దేవంపల్లి జీహెచ్‌ఎం వీవీ సత్యనారాయణ, ఎంఈవో ప్రభాకర్ రావు, సీసీడీవో కృపారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, జనవరి 15 : యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో ఈనెల 16 నుంచి 21 వరకు జరుగనున్న సౌత్ జోన్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు రిత్విక్ సూర్య ఎంపికయ్యాడు. కరీంనగర్‌లోని నిగమా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో అతడు రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్గత కళాశాలల క్రికెట్ పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ చూపి, శాతవాహన యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, అధ్యాపకులు రిత్విక్ సూర్యను అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST

★తేది: 02-03-2022, బుధవారం రోజున గోదావరిఖని, చంద్రశేఖర్ నగర్‌లోని మా ఇంటి వద్ద నుండి బస్టాండ్‌కి వెళ్తుండగా బస్టాండ్ ఏరియాలో నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (నెం: 514/1981) పోయినది. దొరికిన వారు సంప్ర: ఇనుముల రమాదేవి, W/o. సంజీవ్ కుమార్, సెల్: 98494 02464.
NTK-335663

CHANGE OF NAME

★I NADIMETLA GANESH AGAIAH S/O AGAIAH VENKATNARSU NADIMETLA R/o Sapthagiri Colony Karimnagar. Have Changed my name as NADIMETLA GANESH S/O NADIMETLA AGAIAH. For all purposes.
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ప్రతిభావంతులకు ప్రోత్సాహకం అందిస్తాం

జగిత్యాల, జనవరి 15: ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు గోపా (గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రోత్సాహకం అందిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్ కుమార్ గౌడ్ తెలిపారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5016, ద్వితీయ స్థానం రూ.3016, తృతీయ స్థానం రూ.2016 అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య గౌడ్, కోశాధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు దుర్గపు శ్రీనివాస్ గౌడ్, బాలుసాని సత్తయ్య గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముస్కం భూమయ్య గౌడ్, సాయికృష్ణ గౌడ్, బాలుసాని హరీశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

మేడిపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎంపీటీసీ మకిలి దాస్

మేడిపల్లి, జనవరి 15: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్పెషల్ ఫ్రెండ్లి క్రికెట్ మ్యాచ్‌ను మాజీ ఎంపీటీసీ మకిలి దాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేశవేని కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ రాకేశ్, జావద్, వంశీ, శేఖర్, నాగరాజు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, జనవరి 15: మండలంలోని పైడిమడుగు గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 19 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో జోగన్‌పల్లి, పైడిమడుగు జట్లు తలపడ్డాయి. పైడిమడుగు జట్టు గెలుపొందగా నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు.

ఎమ్మెల్సీ కృషితోనే పసుపు బోర్డు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, జనవరి 15: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు గత పదేళ్లలో మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎంతో కృషి చేశారని హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకుడు జేడీ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం శుభపరిణామం అని పేర్కొన్నారు.

వ్యాయామ విద్యపై ప్రత్యేక దృష్టి

జగిత్యాల, జనవరి 15: వ్యాయామ విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం పెటా-టీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు దేశంలో తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులు ఒలింపిక్ స్థాయి పథకాలు సాధించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ప్రధాన కార్యదర్శి అశోక్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

విజేతగా నిలిచిన క్రీడాకారులతో ఎస్ఐ రాజు

మల్లాపూర్, జనవరి 15: గ్రామాల్లోని యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ రాజు సూచించారు. మండల కేంద్రంలో పద్మశాలీ యువసేన ఆధ్వర్యంలో బుధవారం బ్యాడ్మింట్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ, క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎలాల జలపతిరెడ్డి, నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, నూతిపల్లి రాజం, సిరిపురం రవీందర్, ముద్దం సత్యనారాయణగౌడ్, మర్రిపల్లి మల్లయ్య, పెద్దిరెడ్డి లక్ష్మణ్, నిర్వాహకుడు సిరిపురం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారుకు షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 15: ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 82 మంది లబ్ధిదారులకు రూ. 24 లక్షల 11వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈనెల 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, సంగనబట్ల సంతోషి, నాయకులు దినేశ్, లక్ష్మణ్, రాజేశ్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

కోరుట్ల, జనవరి 15: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీని పగులగొట్టి సుమారు రూ. 5 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

జగిత్యాల, జనవరి 15: రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆమె వివిధ శాఖల అధికారులతో పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీ గౌతమ్ రెడ్డి, డీఆర్డీవో రఘువరణ్, డీపీవో మదన్‌మోహన్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కోరుట్ల రూరల్, జనవరి 15: గద్దర్ గళం ఫౌండేషన్ మండల కన్వీనర్‌గా పంచరి ప్రవీణ్‌కుమార్, కో-కన్వీనర్‌గా బానావత్ రూప్ సింగ్‌ను నియమిస్తూ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, జిల్లా కన్వీనర్ ఈదుల లక్ష్మణ్‌కుమార్, కో-కన్వీనర్ వనతడుపుల అంజయ్య బుధవారం నియామక పత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్‌లో నిర్వహించే గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కళాకారులు, ప్రజాప్రతినిధులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుతారి రాములు, చెన్న విశ్వనాథం, ఎండీ మౌలానా, రాము, స్వామి, గంగాధర్, నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, జనవరి 15: పెగడపల్లి మండలం కీచులాటపల్లికి చెందిన ఇరుగురాల లక్ష్మణ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ భాస్కర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడాకారులకు సత్కారం

మేడిపల్లి, జనవరి 15: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి, ప్రథమ బహుమతి సాధించగా మంగళవారం మాషాఅల్లాహ్ ఆన్‌లైన్ సర్వీసెస్, ట్రావెల్స్ అధినేత మహ్మద్ గులాం శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అంగడి ఆనంద్ కుమార్, భూమేశ్‌గౌడ్, సయ్యద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యా యత్నం

సారంగాపూర్, జనవరి 15: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తన తల్లిదండ్రులతో గొడవపడి బుధవారం ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లగా పోలీసులు ఆచూకీ కనుగొని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన 26 ఏళ్ల యువతి తల్లిదండ్రులతో గొడవపడి, ఇంట్లోంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు డయల్ 100కు సమాచారం అందించగా, పోలీసులు వెంటనే స్పందించి యువతి ఆచూకీని కనుగొన్నారు. అక్కడికి వెళ్లే వరకు ఆమె చేతిలో పురుగుల మందు డబ్బా పట్టుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నారు. యువతి తల్లిదండ్రులను పిలిపించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు. యువతిని కాపాడిన పోలీసులు రవీందర్ కుమార్, రవిని ఎస్ఐ, పోలీసులు అభినందించారు.